క్లుప్తంగా

చిన్నారులకు శుభ్రమైన ఆహారం అందించాలి



దంగేరులోని చెరువుగట్టు పేటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ రమణ

కె.గంగవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆహారం శుభ్రంగా రుచిగా చేసి అందించాలని సర్పంచ్ కొప్పిశెట్టి రమణ సూచించారు. మండలంలోని దంగేరుతో పాటు శివారు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందని వాటిని ప్రతి చిన్నారికి అందేలా చూడాలన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించడం, నాణ్యమైన గుడ్లు అందించాలని ఆయన కోరారు.

స్పందనకు అత్యంత ప్రాధాన్యం



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో సింధు సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో పి.సింధు సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీలను స్వీకరించారు. భూ, రెవెన్యూ సమస్యలు-1, మత్స్యశాఖ-1, హౌసింగ్-1, ఇరిగేషన్-1, ఆర్అండ్‌బీ-1, పౌరసరఫరాలు-1, మొత్తం ఆరు అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు. వాటిని పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులకు పంపించామన్నారు. నిర్దేశిత గడువు లోగా స్పందన అర్జీలను అర్జీదారుడిని నమ్మకం భరోసా కలిగేలా పరిష్కరించాలని ఆర్డీవో అధికారులను ఆదేశించారు. తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీ

మండపేట: మండలంలోని కేశవరం గ్రామంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తుపాకుల ప్రసన్నకుమార్ సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో బీసీ శ్మశానవాటిక స్థల సమస్యను పరిష్కరించాలని, ద్వారపూడి విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో ఏఈ నియామకానికి చర్యలు తీసుకోవాలని, వల్లంలో ఉన్న జగనన్న లే అవుట్‌లోని 20 ఇళ్ల స్థలాలను మెరక చేయాలని కోరారు.

శివారు భూములకు సాగునీరందించాలి

కాజులూరు: సాగునీటి విడుదలలో శివారు భూములకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. సోమవారం గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ గోదావరిలోలో తలెత్తిన నీటి ఎద్దడి నేపథ్యంలో పంట కాలువలకు సాగు నీటి సరఫరా తగ్గిందన్నారు. వంతులవారీ విధానంపై అన్ని ప్రాంతాలకు సాగునీరు అందేలా ప్రభుత్వాధికారులు కృషి చేస్తున్నారన్నారు. అయితే తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్న కాజులూరు మండల గ్రామాలకు సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని నీటి సరఫరాలో కాలువ శివారు భూముల పొలాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వటంతో పాటు ప్రత్యామ్నాయ చర్యలపైనా దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.

వల్లూరులో 70 మందికి కంటి పరీక్షలు



వల్లూరులో కంటి పరీక్ష చేస్తున్న కోటేశ్వరరావు

కపిలేశ్వరపురం: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా సోమవారం మండలంలోని వల్లూరులో 70 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. ఈ పరీక్షలు చేసిన పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు వారిలో 60 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఐదుగురుకి శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. శిబిరాన్ని వల్లూరు పంచాయతీ సర్పంచ్ దాసి మీనాకుమారి, కార్యదర్శి తాతపూడి శుభాకర్, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చేంబ్రోలు వీరభద్రరావు సందర్శించారు. శిబిరంలో సచివాలయ ఆరోగ్య కార్యకర్త యార్లగడ్డ స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పి సీహెచ్ స్వప్న, మహిళా పోలీస్ గెద్దం ప్రమీల, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

ప్రభుత్వాసుపత్రుల్లో సుఖ ప్రసవాలు

మాతా,శిశు రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం
- ప్రసవానికి నాలుగు రోజుల ముందే ఆసుపత్రికి తరలింపు
- రెండు నియోజకవర్గాల్లో 555 మంది గర్భిణులు
- 128 మంది హైరిస్క్ కేసులకు ప్రత్యేక చికిత్స



అంగర పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ కన్యాకుమారి

కపిలేశ్వరపురం: ప్రసవం ఒకప్పుడు ఓ ప్రహసనం. మాతా,శిశు రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టడంతో ఇప్పుడు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం చేయించుకునేందుకు గర్భిణులు, వారి సంరక్షకులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రుల్లో తగ్గిన ప్రసవాల సంఖ్య ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల పట్ల ఆసక్తిని స్పష్టం చేస్తోంది. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ)ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తీరు ఇందుకు ఎంతగానో దోహదం చేస్తోంది.

జిల్లాలో ప్రసవాలిలా..

2021-22 లో ప్రైవేట్ ఆసుపత్రుల్లో 16,822 ప్రసవాలు జరగ్గా 2022-23 జనవరి వరకూ 10,500 కి తగ్గాయి. 2022-23లో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు 4,223 మంది జరుపుకున్నారు.

మండలాల వారీగా గర్భిణులు ఇలా...

కపిలేశ్వరపురం మండలంలో 53,500 మంది జనాభా ఉండగా, మూడు పీహెచ్‌సీల్లో 103 మంది గర్భిణులు జనవరిలో పరీక్షలు చేయించుకున్నారు. కాగా వారిలో 41 మందిని హైరిస్క్ గల వారిగా గుర్తించారు. 67,688 జనాభా గల మండపేట మండలంలోని రెండు పీహెచ్‌సీల్లో 46 మంది గర్భిణులను పరీక్షించగా 12 మందిని హైరిస్క్ గల వారిగా గుర్తించారు. 74,962 జనాభా గల రాయవరం మండలంలోని రెండు పీహెచ్‌సీల్లో 104 మంది గర్భిణులను పరీక్షించగా 11 మంది హైరిస్క్‌గల వారిగా గుర్తించారు. 59,415 జనాభా గల కాజులూరు మండలంలోని రెండు పీహెచ్‌సీలలో 92 మంది గర్భిణులను పరీక్షించగా 24 మందిని హైరిస్క్ గలవారిగా గుర్తించారు. 55,452 జనాభా గల రామచంద్రపురం మండలంలోని రెండు పీహెచ్‌సీలలో 67 మంది గర్భిణులను పరీక్షించగా 11 మందిని హైరిస్క్‌గల వారిగా గుర్తించారు. 76,118 జనాభా గల కె.గంగవరం మండలంలోని ఐదు పీహెచ్‌సీలలో 143 మంది గర్భిణులను పరీక్షించగా 29 మందిని హైరిస్క్‌గల వారిగా గుర్తించారు.

ప్రసవాలకు ప్రోత్సాహమిలా...

నూరు శాతం ప్రసవాలు ప్రభుత్వాసుపత్రుల్లోనే జరగాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రులతో పాటు సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో ప్రసవాలు జరుగుతున్నాయి. వివాహిత గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవించే వరకూ ప్రభుత్వ వైద్య ఆరోగ్య సిబ్బంది క్రమంతప్పకుండా పరీక్షలు చేసి ఎప్పటికప్పుడు ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పిస్తూ, ప్రసవం ప్రభుత్వాసుపత్రిలోనే మేలనే నమ్మకాన్ని గర్భిణుల్లో కల్పిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లోనే గాకుండా కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకునేవారికి సైతం ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేస్తోంది. గర్భిణి ఇంటి వద్ద నుంచి ఆసుపత్రికి రావడానికి 108 అంబులెన్స్, డిశ్చార్జి అనంతరం ఇంటికి వెళ్లేందుకు 102 వాహన సౌకర్యం కల్పిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం జిల్లాకు 13 తల్లీ బిడ్డా వాహనాలను కేటాయించింది. అమలాపురం, రామచంద్రాపురం ఏరియా ఆస్పత్రులకు రెండు చొప్పున నాలుగు వాహనాలను సీహెచ్‌సీలకు ఎనిమిది వాహనాలను కేటాయించారు. కపిలేశ్వరపురం, మండపేటలలో వాహనాలు అందుబాటులో ఉన్నాయి. శిశువుకి మొదటి టీకా వేస్తుంది.

సాధారణ ప్రసవాలకూ ప్రోత్సాహం...

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరుపుకున్న బాలింతలకు ఆరోగ్య ఆసరా పథకంలో భాగంగా ప్రోత్సాహక బహుమతులను అందజేస్తుంది. సాధారణ ప్రసవానికి రూ.4,000, సిజేరియన్ ప్రసవానికి రూ.3,000 ఇవ్వడంతో పాటు వారందరికీ పోషకాహారాన్ని సమకూర్చుకునేందుకు అదనంగా ప్రభుత్వం రూ.1000 అందజేస్తుంది.

తల్లీ, బిడ్డల సంరక్షణే ధ్యేయం



తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల సిబ్బంది శ్రమిస్తున్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు చేస్తున్నాం. ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకునేలా గర్భిణికి, వారి సంరక్షకులకు అవగాహన కల్పిస్తున్నాం.

–డాక్టర్ పి.రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ

అసంపూర్తిగా ఎంపీడీఓ కార్యాలయ భవనం



మొండి గోడల దశలో నిలిచిన మండల పరిషత్ కార్యాలయ భవనం

కపిలేశ్వరపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ నూతన భవన నిర్మాణం దీర్ఘకాలంగా అసంపూర్తిగా ఉండిపోయింది. 2009 ఫిబ్రవరిలో రూ.55 లక్షల ఎంపీపీ ప్లెయిన్ నిధుల అంచనా వ్యయంతో మండల పరిషత్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. గుమ్మం ఎత్తు వరకూ గోడల నిర్మాణం పూర్తయ్యింది. తర్వాత నిధులు సరిపోక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా పనుల్లో కదలిక రాని పరిస్థితి. ప్రస్తుతం శిథిల భవనంలోనే కార్యాలయ నిర్వహణ కొనసాగుతోంది. దీనికి తోడు ఎన్ఆర్ఈజీఎస్, ఇంజినీరింగ్ శాఖలు కూడా ఈ శిథిల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.40 కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి పనులు

- కౌన్సిల్ సమావేశంలో మంత్రి వేణు
- రూ.2.02 కోట్ల మిగులు బడ్జెట్‌కు కౌన్సిల్ సభ్యుల ఆమోదం



మున్సిపాలిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పురపాలక సంఘం పరిధిలో రూ.40 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సమావేశం సోమవారం జరిగింది. తొలుత 2023-24 మున్సిపల్ బడ్జెట్ అంచనాలను సమావేశంలో ప్రవేశపెట్టారు. సీనియర్ అసిస్టెంట్ కె.వేణుగోపాలరావు సభ్యులకు బడ్జెట్‌ను చదివి వినిపించారు. చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ రాబోయే ఏడాదికి గాను రూ.10 కోట్ల 10 లక్షల 90 వేల అయిదు వందల రూపాయల ఆదాయంగాను రూ.8 కోట్ల 8 లక్షల 50 వేల 867 ఖర్చుగాను అంచనాల బడ్జెట్‌ను రూపొందించారన్నారు. దీంతో రూ.2,02,39,633 మిగులు బడ్జెట్‌కు ఆమోదం తెలిపినట్లు చైర్‌పర్సన్ శ్రీదేవి ప్రకటించారు. మూలధన ఆదాయం కింద రూ.46 కోట్ల 38 లక్షలకుగాను మూలధన ఖర్చుల నిమిత్తం రూ.49 కోట్ల 39 లక్షల 50 వేల రూపాయలు కాగా ముగింపు నిల్వ రూ.96 లక్షల 46 వేల 753గా పేర్కొన్నారు. మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్ నుంచి నీటి సరఫరాకు రూ.65 లక్షలు, డ్రైనేజీలకు రూ.37 లక్షలు, రోడ్ల నిర్మాణానికి రూ.54 లక్షలు, వీధి దీపాలకు రూ.28 లక్షలు, వినోద సౌకర్యాలకు రూ.30 లక్షలు మార్కెట్, పార్కులు భవనాలు, సామాజిక భవనాలు, మలమూత్ర విసర్జన శాలలకు రూ.49 లక్షలతో మొత్తం రూ.2 కోట్ల 63 లక్షలు వెచ్చిస్తున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశుసంక్షేమం కోసం రూ.2 కోట్ల 28 లక్షలు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ మున్సిపాలిటీ తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని దానికి తగిన నిధులు కేటాయించి పట్టణంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రాకుండా చేయాలని సూచించారు. పట్టణానికి సుందరీకరించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. దీనికి తోడు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్ల 75 లక్షలు, గ్రాంట్ ద్వారా రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా ప్రభుత్వ నిధులు రూ.2 కోట్ల 40 లక్షలు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. పట్టణంలోని నిరుపయోగంగా మారిన సామూహిక మరుగుదొడ్లను వెంటనే తొలగించి ఆయా స్థలాల్లో సంబంధిత ప్రాంత ప్రజలు వినియోగించుకునే విధంగా కమ్యూనిటీ హాల్స్ నిర్మించనున్నట్లు మంత్రి వేణు తెలిపారు. దీనికి ప్రతిపాదనలు తయారు చేయాలని డీఈ దుర్గాప్రసాద్‌ను మంత్రి ఆదేశించారు. నూతనంగా నిర్మించే టిడ్కో ఇళ్లలో కరెంట్ మీటర్లు వెంటనే ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. మొదటి విడతలో లబ్ధిదారులు అందరూ టిడ్కో గృహాల్లోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా రెండో విడతలో లబ్ధిదారులను పూర్తి చేసి పంపిణీ చేసేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని మంత్రి వేణు ఆదేశించారు. కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్‌లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన



మహిళలకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మండపేట 25వ వార్డులో గడప గడపకూ..

మండపేట: పేదల అభ్యున్నతి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం దోహదం చేస్తోందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, పార్టీ జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాల పరిశీలకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు తదితరులతో కలిసి సోమవారం స్థానిక 25వ వార్డు సైదిల్‌పేటలో ఎమ్మెల్సీ తోట గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మమేకమయ్యారు. మూడేళ్ల పాలనలో వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడికక్కడే మున్సిపల్ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

ఎమ్మెల్సీ తోటకు ఘన స్వాగతం

సైదులపేటలో ఎమ్మెల్సీ తోటకు ఘన స్వాగతం లభించింది. కౌన్సిలర్ ముక్కా మేరీ స్వరూపరాణి, సుబ్రహ్మణ్యం దంపతుల ఆధ్వర్యంలో వార్డులోని ప్రజలు పూలవర్షం కురిపిస్తూ తీన్‌మార్ నృత్యాలు, బాణసంచా కాల్పులతో స్వాగతం పలికారు. సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు, కౌన్సిలర్ ముక్కా లోవలక్ష్మి, దాలయ్య, సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, పార్టీ రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు, పార్టీ నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, అడబాల వీరబాబు, పెంకే గంగాధర్, బొడ్డపాటి మంగరాజు, పలివెల సుధాకర్, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన ఉండాలి



కూళ్లలో వైద్య సిబ్బంది సూచనలిస్తున్న సూపర్‌వైజర్ మల్లికార్జునుడు

కె.గంగవరం: ఆరోగ్య సిబ్బంది తప్పనిసరిగా నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలని పామర్రు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మల్లికార్జునుడు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కుళ్ల, పామర్రు, అముజూరు, పాణింగపల్లి తదితర గ్రామాల్లోని పీహెచ్‌సీ సబ్ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి వైద్య సిబ్బందికి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నేడు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద నులిపురుగుల నివారణకు సంబంధించిన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. వాటిని ప్రభుత్వ నిర్దేశించిన విధంగానే వాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ పంపిణీకి ఏర్పాట్లు

కపిలేశ్వరపురం: ప్రభుత్వం మంగళవారం నిర్వహించే డీవార్మింగ్ కార్యక్రమానికి అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. అంగర పీహెచ్‌సీలో సోమవారం వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి క్షేత్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమంపై వైద్య, ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, ఆశ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ అనుబంధ శాఖల సమన్వయంతో క్షేత్ర స్థాయిలో ఆల్బెండజోల్ మాత్రలను 19 ఏళ్ల పిల్లలకు పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులు మాత్రలను వేసుకునేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెచ్ఈ రామారావు సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్‌లు టి.మేరీ, పి.సురేష్ పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల జయంతి జీఓపై బీసీ సంఘాల హర్షం



ద్రాక్షారామలో మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసిన బీసీ నాయకులు

రామచంద్రపురం రూరల్: తొలి తెలుగు కవయిత్రిగా ప్రసిద్ధి చెందిన మొల్ల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి జీఓ జారీ చేయడంపై బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ద్రాక్షారామ మసీదు సెంటర్ వద్ద నియోజకవర్గ కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షుడు దాలిపర్తి భీమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీసీ నాయకులు ప్రభుత్వానికి తమ కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకి రామాయణాన్ని సంస్కృతం నుంచి సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలుగులోకి కేవలం 5 రోజుల్లోనే అనువదించడం చరిత్రాత్మక విషయన్నారు. మొల్ల జయంతిని రాష్ట్ర ప్రభుత్వ పండగగా గుర్తించడం బీసీలపై సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వ సానుకూల వైఖరికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మాగాపు శ్రీనివాస్, మానేపల్లి అచ్చారావు, ఏడిద వీరబాబు, దాలిపర్తి కిరణ్, యాట్ల నాగేశ్వరరావు, కోటిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి

గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్సీ తోట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కీలకభూమిక పోషించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. చెల్లూరులో సోమవారం కూర్మాపురం, కురకాళ్లపల్లి, వెంటూరు, చెల్లూరు, పసలపూడి, మాచవరం గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో ఎమ్మెల్సీ తోట సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని, ప్రభుత్వం సంక్షేమానికి చిరునామాగా మారిన విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తూ ప్రజలతో మమేకం కావాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో పాటుగా ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. సమావేశంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి, పార్టీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ చిన్నం అపర్ణ తదితరులు కూడా ప్రసంగించారు. సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమావేశంలో పరిచయం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కొవ్వూరి అమ్మిరెడ్డి, గుబ్బల సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు కత్తుల సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేస్తున్న అధికారులు

కాజులూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ బుధవారం నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు ప్రారంభం కానుండగా, 16వ తేదీ గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమై ఏప్రిల్ నాలుగు వరకూ జరుగుతాయన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 15 నుంచి 25 వరకూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఉంటుందన్నారు. ఈ ఏడాది తమ కళాశాల విద్యార్థులతో పాటు గొల్లపాలెం కాకతీయ కళాశాల, పీఎస్ఎన్ మూర్తి కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాయనుండగా ఇంటర్ మొదటి సంత్సరం విద్యార్థులు 330, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 250 మంది పరీక్షకు హాజరుకానున్నారన్నారు. ఇందులో మొదటి సంవత్సరం పరీక్షలకు కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 150 మంది, గొల్లపాలెం కాకతీయ కళాశాల నుంచి 150 మంది, పీఎస్ఎన్ మూర్తి కళాశాలల నుంచి 30 మంది, ద్వితీయ సంవత్సరానికి కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 120 మంది, గొల్లపాలెం కాకతీయ కళాశాల నుంచి 100 మంది, పీఎస్ఎన్ మూర్తి కళాశాలల నుంచి 30 మంది చొప్పున మొత్తం 580 విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాయనున్నారన్నారు.

మండపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

మండపేట: ఇంటర్ పరీక్షల నిర్వహణకు స్థానిక ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కళాశాల ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటిండెంట్ ఈఎస్ కుమార్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివరాలు, విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సోమవారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. బుధవారం నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష సమయం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ ఉంటుందన్నారు. తమ కళాశాలలో జనరల్, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు ఒక గంట ముందుగానే చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతించరన్నారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడవన్నారు. తరగతి గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



పరీక్షలు నిర్వహించే కాజులూరు ప్రభుత్వ ప్రభుత్వ జూనియర్ కళాశాల



ఈఎస్ కుమార్, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్

అర గంట ముందే పరీక్ష కేంద్రంలో ఉండాలి

ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. పరీక్షలను మండల తహసీల్దారు, పోలీసులు అధికారులు పర్యవేక్షించనున్నారని పరీక్ష సమయానికి ఆలస్యంగా వచ్చిన వారిని లోనికి అనుమతించమన్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాలకు అనుమతించమన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షను అమలులో ఉంటుందని పరీక్ష రాసే సమయంలో విద్యార్థుల ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా కళాశాల పరిసరాల్లో ఉన్న స్థానికులు, ప్రజలు సహకరించాలన్నారు.

– కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్

ఆర్ఆర్ఆర్ టీంకు ప్రముఖుల శుభాకాంక్షలు

మండపేట: ఆస్కార్ అవార్డు సాధించడం ద్వారా తెలుగు భాష గొప్పదనాన్ని 'ఆర్ఆర్ఆర్' సినిమా ప్రపంచ వ్యాప్తం చేసిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. 'నాటు నాటు' పాట ద్వారా 'ఆర్ఆర్ఆర్' సినిమాకు ఆస్కార్ అవార్డు రావడం పట్ల చిత్ర బృందానికి ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ తదితరులు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు.